## క్లుప్తంగా

### నేడు భైంసాకు కేంద్రమంత్రి రాక

భైంసాటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శనివారం భైంసాకు రానున్నట్లు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ కార్యకర్తలు, పట్టభద్రులైన ఓటర్లతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ గోడం నగేశ్, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులు హాజరవుతారని.. నాయకులు, కార్యకర్తలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### వాహనాల తనిఖీ


జరిమానా విధిస్తున్న అధికారులు

ఖానాపూర్: వాహనదారులు అన్ని పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని ఏఎంవీఐలు అక్షయ్, రజనీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. పత్రాలు సరిగా లేని నాలుగు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి జరిమానాలు విధించారు. అన్ని అనుమతి పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తేజారావు, కార్తీక్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు.

### 24న సీఎం సభకు రావాలి

లక్ష్మణచాంద: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 24 నిర్మల్‌లో నిర్వహించే సీఎం రేవంత్ రెడ్డి సభకు పట్టభద్రులు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనకాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ జనరల్ సెక్రటరీ మేకల రాజేందర్ యాదవ్, నారాయణ, మల్లేశ్ పాల్గొన్నారు.

### వృద్ధుడి ఆచూకీ లభ్యం


కుటుంబీలకు అప్పగిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతాండ గ్రామానికి చెందిన జాదవ్ గోపిచంద్ అనే వృద్ధుడు బుధవారం ఉదయం నుండి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. శుక్రవారం సోన్ మండలం గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు అతడిని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం పోలీసులు వృద్ధుడిని నర్సాపూర్(జి)పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

### బాధిత కుటుంబాలకు సాయం


సాయం అందిస్తున్న రాశిమెట్ల గ్రామస్తులు

మామడ: పెంబి మండలం రాయదారిలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను శుక్రవారం మండలంలోని రాశిమెట్ల గ్రామస్తులు పరామర్శించారు. ఈసందర్భంగా రూ.20వేలు, నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో రాశిమెట్ల గ్రామపెద్దలు వసంత్‌రావు, ప్రకాశ్, రమేశ్ ఉన్నారు.

### రాష్టస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కుభీర్: మండలంలోని పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జె.ఈశ్వరి(తొమ్మిదో తరగతి) బంగారు పతకం, కండికె శృతి(ఆరో తరగతి) వెండి పతకం సాధించింది. శుక్రవారం విద్యార్థులతోపాటు శిక్షకురాలు ప్రతిక్షను హెచ్ఎం నారాయణ్‌రెడ్డి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### ముధోల్ ఇన్‌చార్జిగా నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ జాబితా విడుదల చేసింది. ఇందులో ముధోల్ నియోజకవర్గం బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్‌కు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఊరూరా 'బెల్టు' దందా..

- బార్లను తలపిస్తున్న పల్లెలు
- గ్రామాల్లో దేశీదారు, కల్తీమద్యం విక్రయాలు..?
- ఎన్నికల కోడ్ ఉన్నా.. ఆగని దందా
- పట్టించుకోని అధికారులు


ఖానాపూర్ మండలం ఒడ్డెవాడలో కార్డన్‌సెర్చ్‌లో పట్టుబడిన మద్యం (ఫైల్)

ఖానాపూర్: ఊరూరా బెల్టుషాపులు వెలుస్తుండటంతో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. సులువుగా ఆదాయం వచ్చే వ్యాపారం కావడంతో అక్రమమని తెలిసినా పల్లెల్లో బార్లను తలపించేలా సిట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని పట్టణాలు, మండలకేంద్రాలతోపాటు మారుమూల పల్లెల వరకు ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. వీడీసీలు వేలం నిర్వహించిన గ్రామాల్లో ఒకే బెల్టు షాపు.. వేలం వేయని గ్రామాల్లో మాత్రం వీధి వీధినా కిరాణ దుకాణాల్లోనూ విక్రయాలు సాగుతున్నాయి. అడపాదడప బెల్టుషాపులపై కొరడా ఝుళిపిస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు.. దాబాల్లో సాగుతున్న సిట్టింగ్‌లను పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

**విమర్శల వెల్లువ..**

గుడుంబా విక్రయించేవారిని పట్టుకుని బైండోవర్ చేస్తున్నప్పటికీ బెల్ట్‌షాపులను మాత్రం ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపులకు నిర్వాహకులు మద్యాన్ని లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు. మద్యం దుకాణాలు(వైన్సులు) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. యువకులు కూడా మద్యానికి బానిసవుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. కొందరు తాగి గొడవపడుతూ పోలీస్‌స్టేషన్ల వద్దకు వెళ్తున్నారు. బెల్టుషాపులను వేలంలో రూ.లక్షలు వెచ్చించి దక్కించుకున్న వారు మద్యం సీసాలపై అదనంగా వసూలు చేస్తున్నామని నిర్వాహకులే చెబుతున్నారు.

**కల్తీ విక్రయాలకు అవకాశం..**

బెల్టు షాపుల్లో విడిగా మద్యం విక్రయించే అవకాశం ఉంది. దీంతో పలువురు యజమానులు కాసుల కోసం మద్యాన్ని కల్తీ చేసే అవకాశం లేకపోలేదు. ఖరీదైన మద్యంలో చీప్‌లిక్కర్ నింపి విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వైన్స్‌ల్లోనే చెత్తాచెదారం ఉన్న బీర్ల విక్రయిస్తున్న ఘటనలు గతంలో ఖానాపూర్, కడెం మండలాల్లో వెలుగుచూసింది. బెల్టు షాపులను నియంత్రించాలని విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. ఈ దందా యథేచ్ఛగా సాగుతుండటం గమనార్హం.

**చర్యలు తప్పవు..**

అనుమతి లేకుండా నిర్వహించే బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. తమ దృష్టికి వచ్చిన వాటిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– రంగస్వామి, ఎక్సైజ్ సీఐ, నిర్మల్

# అన్ని మందులు అందుబాటులో ఉంచాలి

- చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి మంజునాథ్


వివరాలు తెలుసుకుంటున్న మంజునాథ్

నిర్మల్‌రూరల్: రోగులకు ఇబ్బంది కలగకుండా అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి మంజునాథ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను పరిశీలించారు. గడువు తేదీకి దగ్గరగా ఉన్న మందులను వెంటనే ఉపయోగించాలని సూచించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణాధికారి బారే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం


కడెం జెడ్పీ హైస్కూల్‌లో 1988-89లో పదో తరగతి చదివినవారంతా ఆత్మీయ సమ్మేళనం పేరిట శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాలు, వృత్తుల్లో స్థిరపడ్డ వారంతా 36 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. - కడెం

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

- విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న నాయకులు, పక్కన అన్వేశ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పెన్షనర్ సంఘ భవనంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రూప్–1 పరీక్ష నిర్వహించి 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి రిటైర్డ్ ఉద్యోగులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్ రెడ్డి, పి.విలాస్, పి.జనార్దన్, కె.రమేశ్, బి.కిషన్ రావు, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి, అప్పాల గణేశ్ చక్రవర్తి, రాజేందర్, పద్మాకర్ పాల్గొన్నారు.

సారంగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మ న్ సుంకెట అన్వేశ్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో సమావేశమై మాట్లాడారు. నిర్మల్, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్లు సోమ భీంరెడ్డి, అబ్దుల్ హాదీ, పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్ ఉన్నారు.

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

# 'అభివృద్ధికి అడ్డుపడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే'


పైపులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

సోన్: నిర్మల్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అడ్డుపడుతున్నారని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన సోన్ మండలకేంద్రంలో పర్యటించారు. వృథాగా పడి ఉన్న అమృత్ పథకం పైపులను పరిశీలించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు. నిర్మల్ పట్టణ ప్రజల నీటి సమస్య తీర్చేందుకు అమృత్ పథకం కింద రూ.62కోట్లు మంజూరైతే పనులు జరగకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం లోకల్ వెల్మల్ గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ, ధ్వజ, యంత్ర, శిఖర, ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, అల్లోల మురళీధర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, వినోద్‌కుమార్, పాకాల రామచందర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్


లోకేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

లోకేశ్వరం: బీజేపీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్యను గెలిపించాలని ఎంపీ నగేశ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఎమ్మెల్యే రామారావు పటేల్, పార్టీ కన్వీనర్ సాయన్న, రాజేశ్‌బాబు, నారాయణ్‌రెడ్డి, మెండె శ్రీధర్, సుమన్‌కుమార్, నల్ల రమేశ్, భాస్కర్, పోతన్న, శంకర్‌గౌడ్, భూమేశ్ ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ్‌రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, శివాజీ పటేల్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాసర: బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఖానాపూర్: బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనిల్‌రావు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి


పొట్టపెల్లిలో ఎరువు పరిశీలిస్తున్న ఎంపీడీవో

లక్ష్మణచాంద: గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాధ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. పొట్టపెల్లి(కే)లో సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించి కార్యదర్శిని ప్రియాంక, సిబ్బందిని అభినందించారు. తయారు చేసిన రెండు టన్నుల సేంద్రియ ఎరువును గ్రామ రైతులకు అందించి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం లక్ష్మణచాంద గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వీధులు కలియ తిరుగుతూ ప్రజా సమస్యలుంటే పరిష్కరించాలని సూచించారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గుంతలకు మరమ్మతు చేయించరూ


ఐబీ వద్ద భగీరథ నీటి లీకేజీతో ఏర్పడిన గుంత


కమల థియేటర్ సమీపంలో..


భగత్‌సింగ్ చౌక్ వద్ద కల్వర్టుపై ఏర్పడిన గుంత

భైంసాటౌన్: పట్టణంలో పలుచోట్ల రోడ్లు, కల్వర్టులపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. 10వ వార్డు పరిధిలోని కమల థియేటర్ సమీపంలో, ఓ ప్రైవేట్ ఆస్పత్రి పక్కన కల్వర్టుపై గుంతలు ఏర్పడ్డాయి. ఎనిమిదో వార్డు పరిధిలో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే మార్గంలో బస్టాండ్ ప్రధాన రహదారిపై ఐబీ వద్ద భగీరథ పైపులైన్ లీకేజీతో గుంత ఏర్పడింది. నిత్యం గుంతలో నీరు నిలుస్తుండడంతో గమనించని వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వెళ్లే వాహనదారులు కింద పడుతున్నారు. ఇటీవల మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్.. ఈ గుంతలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### ఆయిల్‌పాం సాగు పరిశీలన

సోన్: మండలంలోని మాదాపూర్, పాక్‌పట్ల, న్యూవెల్మల్ గ్రామాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను శుక్రవారం ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి బి.వి.రమణ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికా రి మౌనిక, కంపెనీ ప్రతినిధి ముత్యంరెడ్డి, శేఖర్, మధు, రైతులు తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటలను, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను శుక్రవారం జిల్లా ఉద్యానవన శాఖాధికారి బివి.రమణ పరిశీలించారు. పంట రక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మౌనిక, భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శేఖర్, క్లస్టర్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

### 'పోరాడే వారిని గెలిపిద్దాం'

ఖానాపూర్: ధన రాజకీయాలను ఓడించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పాటుపడే అశోక్‌కుమార్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, సంఘం కుటుంబ సంక్షేమనిధి జిల్లా కన్వీనర్ గోవర్ధన్‌రావు, జిల్లా కార్యదర్శి మురళీధర్ ఉన్నారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


సోన్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు


భైంసారూరల్: బహుమతి ఇస్తున్న ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ తొడిశెట్టి పరమేశ్వర్ మాట్లాడుతూ ప్రాథమికవిద్యను మాతృ భాషలోనే బోధిస్తే విద్యార్థులు ప్రతిభావంతులుగా మారుతారని పేర్కొన్నారు. అంతకుముందు విద్యార్థులు మాస్కులు, గౌనులు, షర్ట్‌ను టీఎల్ఎం పద్ధతిలో ప్రదర్శించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు విజయవాణి, రాధ, శైలజ పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు రవికుమార్, రాజు, సుధాకర్, ఓంప్రకాష్, సంతోష్‌కుమార్, నహీదా, కల్పన తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తెలుగు అక్షరాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం రాధిక, ఉపాధ్యాయులు సోనియా, కవిత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ధర్మోరలో పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో భక్తాంజనేయ స్వామి నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మూడో రోజుకు చేరింది. శుక్రవారం మండపపూజ, వేదపారాయణం, అభిషేకం, హవనం, ధాన్యధివాసం, తీర్థప్రసాద సేవనం, హోమం బ్రహ్మశ్రీకుప్పకంటి సురేష్‌శర్మ జరిపించారు. అనంతరం అన్నదాన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపైనే మురుగు.. రాకపోకలు ఎలా?



భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో డ్రెయినేజీ లేకపోవడంతోనే రోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: భోజన్న, పంచాయతీ కార్యదర్శి, ఫోన్: 95052 36390

### విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహాల శోభాయాత్రలో గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ హనుమాన్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజు ఆంజనేయస్వామి, నంది విగ్రహాలు, ధ్వజ స్తంభంను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆవరణలో హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కేశం శ్రీనివాస్, రవి, వీడీసీ సభ్యులు ఆశన్న, గణేశ్ పాల్గొన్నారు.